# పల్లెకు పట్టం

## కేసీఆర్ (పల్లె ప్రగతి)

నిధులతోనే పంచాయతీల విధులు సక్రమంగా సాగుతాయి. గ్రామ పాలన చల్లగా కొనసాగుతుంది. మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యమూ పరిఢవిల్లుతుంది. పల్లెలో పుట్టిపెరిగిన వ్యక్తిగా, పల్లెల్ని ప్రేమించే నాయకుడిగా కేసీఆర్ అంతరంగమూ అదే. కాబట్టే, 'పల్లెప్రగతి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కేంద్ర ఆర్థిక సంఘం అందించే నిధులకు సరిసమానమైన మొత్తాన్ని గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ చేయించారు. 4,383 కొత్త పంచాయతీలను ఏర్పాటుచేశారు. 1,177 తండాలు, గూడేలను పంచాయతీలుగా మార్చారు. గ్రామాలు స్వయంసమృద్ధి సాధించేలా కార్యాచరణ రూపొందించారు. నాలుగు దశాబ్దాల్లో కనిపించని ప్రగతిని గత పదేండ్లలో సునాయాసంగా సాధించాయి తెలంగాణ గ్రామాలు.





## మహాత్మాగాంధీ (గ్రామ స్వరాజ్యం)

గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం పురోగమిస్తుంది అని నొక్కి చెబుతారు మహాత్మాగాంధీ. గ్రామ స్వరాజ్యం వర్ధిల్లిన నాడే అసలైన ప్రజాస్వామ్యం వెల్లివిరుస్తుందని విశ్వసించారు బాపు. స్థానిక పరిపాలనను సుస్థిరం చేయాలన్న మహాత్ముడి స్ఫూర్తితో 73, 74వ రాజ్యాంగ సవరణలూ జరిగాయి. తద్వారా పంచాయతీలకు, మున్సిపాలిటీలకు రాజ్యాంగపరమైన రక్షణ లభించింది. జాతిపిత కలలు నెరవేరాయి.

# వ్యవసాయోత్సవం

## కేసీఆర్ (సాగు పండుగ)

మూడుపూటలా తినడానికి సరిపడా గింజలు పండితే చాలనుకొనేది ఒకప్పటి తెలంగాణ. నేడు దేశానికే అన్నం పెట్టే స్థాయిలో ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేస్తున్నది. ఈ విజయం వెనుక.. కేసీఆర్ దార్శనికత, అకుంఠిత దీక్ష ఉన్నాయి. వ్యవసాయ రంగానికి బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రోత్సాహం అపారం. మద్దతు ధర, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, పెట్టుబడి సాయం, పంటల ఎంపిక విషయంలో రైతులకు దిశానిర్దేశం.. మొత్తంగా, వ్యవసాయానికి కొత్త జవసత్వాలు తీసుకొచ్చింది కేసీఆర్ సర్కార్. ఫలితంగా.. ఒకప్పుడు ధాన్యం కొనుగోళ్లలో 14వ స్థానంలో ఉన్న రాష్ట్రం రెండో స్థానానికి ఎగబాకింది. పంజాబ్ తర్వాత అత్యధిక ధాన్యం ఉత్పత్తి, కొనుగోలు చేస్తున్నది మన గడ్డ.





## నార్మన్ బోర్లాగ్ (కొత్త వంగడాలు)

ప్రపంచవ్యాప్తంగా వందల కోట్లమందిని ఆకలి నుంచి, పస్తుల నుంచి రక్షించిన వ్యక్తి నార్మన్ బోర్లాగ్. ఒకరకంగా ప్రపంచానికే అన్నదాత ఆయన. చీడపీడల్ని తట్టుకొని నిలబడి, అధిక దిగుబడులిచ్చే వంగడాలను ఆవిష్కరించడంపై దృష్టిసారించారు. 1960 ప్రాంతంలో కరువు కాటకాలతో అల్లాడుతున్న భారత్, పాకిస్థాన్ దేశాల్లో ఆ వంగడాలను పరిచయం చేశారు. ప్రపంచవ్యాప్తంగా.. 20 కోట్ల పైచిలుకు ఎకరాలలో బోర్లాగ్ కనిపెట్టిన వంగడాలను వాడుతున్నారు. ఆ సేవలకు నోబెల్ శాంతి బహుమతి, పద్మవిభూషణ్ పురస్కారాలు వరించాయి.